# మొగుడా?-శాడిస్టు మొద్దా?

విజయనగరంనించి రాజమండ్రి వెళ్ళే బస్సులో నేను ప్రయాణం చేస్తున్నాను. జగ్గంపేటలో బస్సు ఆగింది. జనం దిగుతున్నారు. నేను కిటికీలోంచి బయటకు చూస్తూ ఉండిపోయాను.

హఠాత్తుగా, "అంతా ఖాళీగానే వున్నాదండోయ్., రండి, రండి" అన్న ఆడమనిషి హడావుడి కేకతో నేను డోర్‌వైపు చూసాను. సూట్‌కేస్ మోసుకుంటూ ఒక ముప్పయ్యేళ్ళ స్త్రీ ఆదరాబాదరా లోపలకెక్కుతోంది.

కంగారు కంగారుగా ఆమె కండక్టర్ని దాటి, నా వెనకాల ఖాళీగా ఉన్న త్రీసీటర్‌లోకి నడిచి, సూట్‌కేసును అటకమీద పెట్టింది. సర్రున కూలబడింది బిగిసి పోయున్న కిటికీ తలుపుల్ని గాలి కోసం శ్రమపడి నెట్టింది నుంచుని, గిలక లాగా గిర్రున వెనక్కి తిరిగి, వెనకనించి నా భుజం మీద చెయ్యేసి, "అక్కడ కూర్చున్నారేంటీ? యిక్కడ ఖాళీగా వుంటేనూ, రండి" అంది.

నేను చటుక్కున పూర్తిగా వెనక్కి తిరిగి చూసాను.

ఆమె తెల్లబోయింది! "అహఁహఁ, మీరా.... మావారనుకున్నాను" - అంటూ పాలిపోయిన మొహంతో వెనక్కి తగ్గింది. మరుక్షణంలో "డోర్" కేసి చూసింది.

ముప్పయ్ అయిదేళ్ళ వాడొకాయన అప్పుడే కండక్టరును దాటుకుంటూ ఆమె వంకా నావంకా చురచుర చూసుకుంటూ, వెనకాల ఎగబడుతున్న జనాన్ని ఒక విధంగా ఆపుకుంటూ, తాపీగా వస్తున్నాడు.

అతను తన దగ్గరికి రాంగానే ఆమె నిరుత్సాహంగా "అంతెనకబడ్డారేంటి? నా యెనకాలే వస్తున్నారనుకున్నాను. రండి" అంటూ లోపలికి దారి తీసింది.

ఆ భర్తేం మాట్లాల్లేదు. కిటికీ కానుకొని ఆమె కూర్చుంటే, ఆమె పక్కన అతను కూర్చున్నాడు.

బస్సు బయల్దేరింది. రెండు మూడు నిముషాలు గడిచాయి.

"నీ కాడికి రమ్మనమని ఆయన్ని పిలుస్తున్నావేంటి?" - నా వెనకాల నించి భర్త భార్యతో అంటున్న మాటలు నాకు వినిపించాయి. శబ్దం లేకుండా బస్సు మెత్తగా నడుస్తూండటం చేత ఈ మాటలే కాక తర్వాతి వాళ్ల సంభాషణలు కూడా నాకు చాలా మటుకు వినిపిస్తూనే వచ్చాయి. నేను మధ్య మధ్య క్రీగంట వాళ్లని చూస్తూ వచ్చాను కూడా.

కిటికీలోంచి చూస్తున్న ఆమె చటుక్కున తలతిప్పి అంది: "అహఁహఁ, మీరే వొచ్చి అక్కడ కూర్చున్నారను కున్నాను. .. పాపం, ఆయనేటనుకున్నాడో ఏటి!"

"ఛి ఛి అదేం మాట! హడావిడిలో పొరబాటయిపోయినాది.... సర్లెండి. ఇక్కడ బంగాళా పెంకు ఫ్యాక్టరీలు ఎక్కువగా కనిపిస్తున్నాయి గదా? ఈ చుట్టు పక్కలంతా బంగాళా పెంకెక్కువగా వాడతారేటండీ, లాపోతే ఎగుమతవుద్దా?"

అతనేం మాట్లాడలేదు

బస్సు ఇంకొంచెం దూరం నడిచింది. సగ్గుబియ్యం ఫ్యాక్టరీ వచ్చింది.

ఆమె అంది "సగ్గుబియ్యం ఫ్యాక్టరీ అండోయ్! ఎప్పుడో ఓ పాలి తీసుకొచ్చి చూపిచ్చరూ! సగ్గుబియ్యం యేయించి పోస్తే తెల్లని పాలల్లో చుక్కలు తేలిపోతున్నట్టుగా చూట్టానికి వుంటాది కదూ పాయసం!"

"అవునవును, తెలుపు మీద ఎర్రచుక్కలున్నట్టు. ముందున్న సన్నాసాయన చొక్కాలాగ, కదూ!" - నవ్వాడు భర్త.

అది జీవం లేని విలన్ నవ్వు అది. నా చొక్కా గురించేనని గ్రహించాను.

చిరాగ్గా ఆమె అంది. " ఎవ్వరి చొక్కా యిసయమో మనకెంతుకు, పోల్చటానికింకెయ్యీ లేనట్టు!" ... "అదేమరి?"

గండేపల్లి ఊరు దగ్గరయింది రోడ్డు పక్కనే చెరువు గట్టునున్న రెండుమూడు నిలువుల బ్రహ్మాండమైన ఆంజనేయస్వామి విగ్రహం వచ్చింది.

నా వెనకాల్నించి ఆమె అంది : "అబ్బ ఎంత పెద్ద యిగ్రహమో, చూస్తేనే పాపాలు పోతయ్యి! చెరూలో స్నానం చేసొచ్చి సామికాళ్లకి దణ్ణం పెట్టుకొనెడతారనుకుంటానే!"

భర్త అన్నాడు : "అవునవును, కాళ్లేం ఖర్మ కొంచెం కష్టంగా భుజాలే పట్టుకోవచ్చు, నువ్విప్పుడు పట్టుకోలా, ఆ ఆవారా గాడి భుజాలు, అట్టాగ!"

గొంతు హెచ్చించి ఆమె కస్సుమంది : " పిచ్చి, పిచ్చిగా మాటాడకండి ! పొరబాటయిపోనాదని ఇందాక టెల్సుంచి చెబుతన్నాను - యింకా యింకా అదే సాగదీస్తారేటి !"

ఆ తర్వాత నిశ్శబ్దం చోటుచేసుకుంది.

మురారి వచ్చింది. తమకు ఉచితంగా దొరికే కాఫీ టిఫిన్ల కోసం డ్రైవరూ కండక్టరూ బస్సు ఆపి, హోటల్లో కెళ్లారు. వాళ్ల వెనకాలే వెళ్లిన ప్రయాణీకుల్లో ఆ భర్త ఒకడు. నేను కూడా బస్సుదిగి డోర్ పక్కనే నుంచుని అతన్ని పరిశీలించి చూసాను. అతను చాలా ఆధునికంగా ఉన్నాడు. లోపల భార్య కూడా అందంగానే వుంది. ఇంత ఆధునికంగా ఉన్న ఈ దంపతుల మధ్య ఈ పొరపొచ్చాలేమిటి! తను చేసింది పొరబాటని ఆమె చెబుతున్నప్పటికీ అతగాడు దాన్నే రాపాడతాడేమిటి? చూపులు కలవటాలూ ఒళ్లు తగటాలూ నేరాలా! ఈ మాత్రానికే అపవిత్రులయిపోతారా! ఇవ్వి లేకండా ఎవరికైనా అసలు ప్రయాణం సాగుతుందా? ఇది ఈ దంపతుల మధ్య సరాగమా, విరాగమా? అద్సరే, నన్ను గురించి ఇందాకేమిటి కామెంట్ చేసాడు. "ఆవారా గాడనా"! రాస్కెల్, ఎందుకైనా మంచిది ఈ కేసుని స్టడీ చేయాలి' - నేనిట్లా అనుకొంటూండగా హోటల్లోకని అప్పుడే బస్సు దిగుతున్నాడు కాలేజీ కుర్రాడొకడు.

ఆ కుర్రాడితో నేను, "చూడు మిస్టర్, అదుగో ఆ కౌంటర్ దగ్గర కూర్చునున్న ఆయన లేడూ, ఆయన పూరూ, వృత్తీ కనుక్కొస్తావా, నేను అప్పు తీర్చవలసిన మనిషి ఆయనవునో కాదో తెలుసుకోవాలి ప్లీజ్!" అన్నాను.

అతను అట్టే వెళ్లి ఇట్టే వచ్చాడు,అన్నాడు : "శాంతిమూలం సౌశీల్యం గార్టండి - బారేజి సూపర్వైజర్ట. దానవాయి పేటలో ఉంటున్నార్ట ఆయనేనా ?"

"ఓ సీ, కాదులే థాంక్స్!" అరగంట తర్వాత అందరూ వచ్చి బస్సెక్కారు. బస్సు బయల్దేరింది

ఈసారి సౌశీల్యమే - ఆ భర్తే - మాట్లాడాడు : "నిన్నటి పెళ్ళిలో నీ అసలు రంగు తెలిసిపోయిందిలే!"

"ఏటి తెలిసినాది?" - భార్య అంది

"ఏం తెలిసిందా పెళ్ళి పందిట్లో పబ్లిగ్గా మీ బావతో చెయ్యి చెయ్యి కలిపి పకపకలాడ్డం!.. తెలీకుండా ఇంకేం జేసాడోలే! దొంగ ..."

చటుక్కున కసిగా అందామె. "నోటికొచ్చినట్టు మాటాడకండి కాఫీగ్లాసు క్రింద పడితే నేనూ మా బావకేసారి దాన్ని తీయబొయ్యాం. అది సగసాలాడ్డమా? అయినా మా బావ ఎంత నిప్పులాంటాడో అందరికీ తెల్సు. అమాటకొస్తే మీరు .. మీరు అస్తమానం ఆ నీళ్ల గదికాడే తారట్లాడేరేటి? అంతకన్నా చెడిపోయినాదేటది?... ఆడోళ్లందరూ ఎంత అసహ్యంగా చెప్పుకున్నారో మీ గురించి ఛీ సిగ్గుమాలిన పని "

"ఓహో అదా, వాచీ, వాచీ మర్చిపోయాను లోపల!... అంతేగాని నేన్నీలాగ ఎవరితోనూ సరసాలాళ్లేదే!... అసలయినా నేను మగాణ్ణి! మొగుణ్ణి! మొగుడివల్ల ఇబ్బందేం ఉండదు. ఎంతకయినా తెగించేది పెళ్లామే! ఇప్పుడీ సన్నాసిగాడి బుజాలు పట్టుకుని వేలాడింది నువ్వు కాదూ!"

ఇంచుమించు ఏడుస్తున్నట్టుగా ఆమె అంది . " అవును, నువ్వు మొగుడివి మొగమారాజువి. నువ్వెప్పుడూ మంచోడివే! ఆడపుటక పుట్టాను కనక నేనెప్పుడూ తప్పుడు పన్లు చేసేదాన్నే ! చెడిందాన్నే!" - వెంటనే సన్నగా ఏడుపు మొదలైంది.

"ఏడిస్తే కుదర్దు. ఆ గొట్టంగాడి బుజాలెందుకు పట్టుకున్నావో చెప్పమంటున్నాను... ఊ ‹, చెప్పు....!" - అతనేం చేసాడో తెలీదు.

ఆమె హఠాత్తుగా అంది : " ప్చ్, అమ్మాహ్! .. ఇట్టా కొద్ది కొద్దిగా దేనికి పాణం తీసెయ్యటం, వొకేచుట్టు పీక పిసికేసెయ్యండి, పీడ యిరగడైపోద్ది ! ఛీ దిక్కుమాలిన బతుకు, ఏ నూతిలోనయినా పడిఛస్తే మంచిది!"

"అది నీ యిష్టం .. ఆడూ నువ్వు కలిసి చెయ్యండి! అయినా అప్పుడే చేస్తావా ఏంటి!. . ముందిది చెప్పు!"

ఆమె ఏడుస్తూనే అంది : "యెందుకు చెయ్యనూ, యింటకెళ్ళంగానే నేను చేసే పని యిదే! (ఎక్కిళ్లు) పదేళ్లమట్టి పాణాలు తోడేస్తన్నావు తిన్నియ్యవు, తొంగోనియ్యవూ ముదనష్టపు‹ పెళ్లి యెందుకు చేసాడో మా నాయన. నాకు పెళ్లొద్దయ్యా నేను సదూకుంటానయ్యా అంటే యిన్నాడు గాదు నన్ను నరకంలోకి తోసేసి తను పోయి సొర్గంలో కూచున్నాడు. (ఎక్కిళ్లు) యీ పెళ్లిలో అందర్నీ ఆకరి సూపుసూసేసానుగా, యింకెంతుకు బతకటం, యెదవ బతుకు! పిల్లలికింత నేనింత తిని చస్తాను (ఎక్కిల్లు). యీ రేత్రికేలే (ఎక్కిళ్లు)! యిప్పుడెల్లంగానేలే (ఎక్కిళ్లు, ఏడుపు!) "

నాకర్థమై పోయింది. వీడొక భయంకరమైన హింసానందం గాడు అంటే, శాడిస్టు! శాడిస్టు పుండాకోర్ కొడుకులందరికీ తేలిగ్గా దొరికేది వాళ్ళ పెళ్ళాలే ముందర పెళ్లాల మీద ప్రయోగాలు చేసి ఆ తర్వాత లోకం మీద పడతారు వీళ్ళు! కనకనే, భార్యల్ని అవలీలగా అనుమానించే భర్తలంటే నాకు చచ్చే ఎలర్జీ, అనుమానించటమనే మాటనే ఏవగించుకుంటాన్నేను.

అయితే ఇక్కడొక సందేహం రావచ్చు మొగుణ్ణి నలిపి నల్లేరుకాడ చేసే చండికలుండరా లని. అరుదు! ప్రకృతి సహజంగా స్త్రీ మృదు స్వభావం కలది తను తల్లిని కావాలనే వాంఛా, తన పిల్లల సంరక్షణ పట్ల తపనా - ఇవ్వి ఆమెను ముక్కుకు సూటిగా నడిచేట్టు చేస్తాయి వంకర దోవలు పట్టనివ్వవు. ఆమెలో దాగున్న ఒక మహాశక్తిని ఒహపట్టాన బయటికి రానివ్వవు కూడా కనకనే ఇట్టాంటి 'అశాంతి

మూలం దుశ్శీలం లాంటి స్కాండ్రల్స్ తగిలినప్పుడు ఒక్కొక్క స్త్రీ కృశించిపోతూంటుంది అది నాకు రుచించదు ఆమె, తానొక శక్తి స్వరూపిణిని అని జ్ఞాపకం తెచ్చుకొని. వాడికి బుద్ధిశుద్ధో, అవసరమైతే దేహశుద్ధో రోజుకొకసారైనా చెయ్యాలని నా అభిప్రాయం అందుకు ఆమెకు సాటి స్త్రీలూ, ఇరుగుపొరుగు వాళ్లూ సహకరించాలనేది నాకోరిక అట్లా సహకరించకుండా మనకెందుకులే అని వాళ్ళు తప్పుకుపోవటాన్ని సాంఘికమైన నేరంగా నేను భావిస్తాను! అది తెలిసి చేసే పాపమంటాను!

ఇట్లా నా ఆలోచనలు సాగుతూండగా ఆ భ్రష్టుడు, ఆ శాంతిమూలం సౌశీల్యం ఆ తల్లిని ఏం చేసాడో తెలీదుగాని, ఆమె తన నోటికి కొంగు అడ్డం పెట్టుకుని మరికొంచెం గట్టిగా ఏడవటం మొదలుపెట్టింది ఆమె నిజంగా ఇంటికెళ్లాక తన పిల్లల్ని చంపి తను చావదుగదా అని నాకనిపించింది ఒక్క సారిగా నాలో రక్తపీడన పెరిగినట్లయింది నాలుగైదు క్షణాలాలోచించాను నా డ్యూటీలోకి నేనింక దిగక తప్పదనే నిర్ణయానికొచ్చేసాను

బయటికి చూసాను. రాజానగరం పొలిమేరలో ఉంది బస్సు నేను చటుక్కున లేచి నుంచున్నాను. వెనక్కి చూస్తూ, అతన్తో, " ఏంటి, ఎందుకేడుస్తోందావిడ?" అన్నాను.

"అ¢ కంట్లో నలక పడింది లెండి" అన్నాడు సౌశీల్యం "నలక పడితే ఏడవట మెందుకు?... అయినా మీరిందాకట్నుంచీ వాదన పడుతున్నారేంటి? ఆవిడ చచ్చి పోతానంటోంది. ఇదేనా భర్తగా మీ బాధ్యత?" సౌశీల్యంలో కోపం తన్నుకొచ్చింది అతను చటుక్కున నుంచున్నాడు అన్నాడు."ఇదిగో మిస్టర్ నా భార్య నా ఇష్టం తన్నుకుంటాను, చంపుకుంటాను, మధ్యలో అనవసరంగా కల్పించుకోకు!"

"అదే, అదే, మీ పొరబాటు! భార్య అనేది వస్తువు కాదు, మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోవటానికి! ఆమెను ప్రేమించటానికే గాని చంపటానికి మీకు ఏ హక్కూ లేదు మీరిప్పుడీమాట అన్నారు కాబట్టి రేపు ఆవిడ ఏకారణం చేతనైనా మరణిస్తే కేసుమీ మీదికే వస్తుంది. మేమంతా సాక్షులమవుతాం"

గట్టిగా అరిచాడు సౌశీల్యం "ఏంటీ, కేసా! నీకెన్ని గుండెల్రా!" - ఇలా అంటూ అతను ముందుకొంగి నా కాలరు పట్టుకున్నాడు. నా చేత్తో కొట్టి అతని చేతిని విడిపించుకున్నాను.

ఈ గోలకి కండక్టరు, "ఏంటండీ అది?" అంటూ బస్సుని ఆపించాడు. చుట్టు పక్కల జనమంతా లేచినుంచున్నారు. అదిగో నాక్కావలసింది ఈ సాక్షులే!

నేనన్నాను : "వీళ్లెవరో నాకు తెలీదు. జగ్గం పేటలో వీళ్లెక్కుతున్నప్పుడు ఈమె పొరపాటున నేనే తన భర్తననుకొని నా భుజం మీద చెయ్యేసి పిలిచింది. అప్పట్నుంచీ ఈయనగారు నాకూ ఈవిడకూ లేనిపోని సంబంధం పెట్టి మాటల్లో ఆవిణ్ణి తెగ నలిపేస్తున్నాడు ఆవిడ తన పిల్లల్ని చంపి తను చచ్చిపోతానంటోంది. ఇది న్యాయమేనా?"

సౌశీల్యం ఆవేశంగా అన్నాడు : "అది మేమూ మేమూ చూసుకుంటాం. మధ్యలో నీకేంటి సంబంధం?" వెనకాల సీట్లోంచి ఎవరో అన్నారు : "అవునయ్యా, అది ఆళ్లూ ఆళ్లూ చూసుకునే యిసయం, మద్దిలో మీకేంటండీ?" అందరి వైపూ ఒక సారి చూసాను శాంతంగా అన్నాను.

"నాకేం సంబంధమూ, ఒక ఆడపడుచుకూ తోబుట్టువుకూ ఉన్న సంబంధం! ఇంకో సంబంధం కూడా వుంది. ఇందాకట్నుంచి ఆయన, నన్ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నాడు నేను సన్నాసినిట, ఆవారానిట, గొట్టాంగాణ్ణి. ఇంత వరకూ సహించాను కానీ ఈమెని 'చస్తే వాడితో కలిసిచావు' అన్నాడు అతగండి, ఆమెనతగండి, కాదంటుందేమో!"

సౌశీల్యం ఇబ్బందిలో పడిపోయాడు!

అందరూ ఆమె వైపు చూసారు. ఆమె భళ్లున ఒక్కసారి ఏడు పంతనీ పైకి కక్కేసింది. పమిట కొంగులో మొహం దాచుకుంది. నేను, ఆవెనకాల సీట్లో కూర్చోనున్న ఇందాకటి స్టూడెంటుని "ఏం బాబూ నువ్వేమంటావ్?" అనడిగాను. అతను చురుగ్గా "ఈయన మాటలు నిజమేనండి నేనూ వింటున్నా వీళ్ల సంభాషణ" అన్నాడు జనం వైపు చూస్తూ.

సౌశీల్యం, తోక తొక్కిన త్రాచయిపోయాడు : "అబద్ధం, కుట్ర! ఈళ్లిద్దరూ కలిసి నన్ను అల్లరి జెయ్యాలని చూస్తున్నారు. ఏమయ్యోయ్, ఏంటి విషయం? రాజమండ్రిరా చెబుతా నీ పని! మా మనుషుల్చేత అక్కడికక్కడే మక్కెలిరగదీయించి గోదాట్లో విసిరేయిస్తాను. దొంగ రాస్కెల్, అబద్ధాలు చెప్పి అల్లరి పెడతారంట్రా! నేన్నీకేవయినా బాకీ ఉన్నానేంట్రా?" - ఇట్లా అంటూ మళ్లీ నాకాలరు పట్టుకోబోయాడు.

పాసెంజర్లలో రకరకాల విమర్శలు మొదలయ్యాయి. ఆ స్టూడెంటు, వాళ్లందరికీ విడమరచి జరిగిన సంభాషణ చెబుతున్నాడు. కండక్టరు "ఇదేం గోల! రాజమండ్రిలో దిగాక మీరూ మీరూ చూసుకోండి" అంటూ బస్సును బయల్దేరనివ్వబోయాడు.

హఠాత్తుగా నేను అరిచాను : "కండక్టర్ బస్సు ఆపు! ఇప్పుడు చెబుతున్నాను నేనెవర్నో. నేను సి.బి.సి.ఐ.డి. ఇన్స్పెక్టర్ని. భార్యల్ని చంపే భర్తల్ని పట్టుకోటానికే నన్నీ జిల్లాకి పంపించారు. ఇదుగో నా ఐడెంటిటీ కార్డు!" - ఇట్లా అంటూ, ఒకపక్క ఫొటో అంటించి, రెండో పక్క ముద్ర వేసున్న మడతకార్డును నా జేబులోంచి తీసి చూపించాను. అందరికీ ఒక్కసారి చూపించి చటుక్కున జేబులో పెట్టేసుకున్నాను.

మళ్ళీ గట్టిగా అరిచాను : "కండక్టర్, ఈ పెద్దమనిషి ఇందాకట్నించీ ఆమెను చంపుతానంటున్నాడు, నన్ను తిడుతున్నాడు, ఇంకా చాలా కేసులున్నాయి ఈయన మీద. పోనీ బస్సు రాజానగరం పోలీస్ స్టేషన్‌కు పోనీయ్!" అంతా అవాక్కయిపోయారు!

వెనకాల్నుంచి ఎవరో ఒకాయన, "ఏదిబాబూ మీ కార్డొకసారి చూపిస్తారా?" అన్నాడు.

ఆ ప్రశ్నలో నా అధికారాన్ని ప్రశ్నిస్తున్న వెటకారం ధ్వనించింది. ఒళ్ళు మండిపోయింది నాకు. మళ్లీ అరిచాను : "ఏంటయ్యా చూసేది, పదపద , నువ్వు కూడా స్టేషనుకు పద, అన్నీ చూద్దువుగానీ... పోనీవ్వయ్యా డ్రైవరూ, స్టేషనుకు పోనీ! అన్నట్టు డ్రైవరూ నీ నెంబరెంత?"

డ్రైవరు కంగారు పడిపోయాడు. అంత పెద్ద సౌశీల్యమూ నోరెళ్ళ బెట్టి కూలబడిపోయాడు. నాలుగు క్షణాల పాటు బస్సంతా నిశ్శబ్దమైపోయింది. నెమ్మదిగా ఎవరో అన్నారు : "ఆఁ స్టేషనూ కేసులూ ఎందుకు లెండి, లేనిపోని గోల! ఈయనగారికి బుద్ధిచెబితే పోలా!.... ఏవయ్యా ఆవిణ్ణి హత్య చేసి చంపటానికయ్యా పెళ్లి చేసుకుంది! నువ్వెక్కడి మొగుడివయ్యా! చూస్తే పెద్దమనిషిలుగున్నావ్!"

ఇంకొకళ్లందుకున్నారు : "అద్సరే, యస్సయిగారిని ఇరికించట మెందుకంట మధ్యలో, బుర్రల ేగ్గాని!" ఇంకోరు : "ఈయన గారేవఁయిన సత్యహరిచ్చంద్రుడా, ఏ ఆడదాన్నీ తగలకుండానే బస్సులెక్కుతన్నాడా, యెదవబుద్ధి గాని! గుడిసేటి మేళం"!

ఇప్పటి కందుకున్నారు నావెనకాల్నించి ఆడవాళ్లు : "ఏటీ పెళ్లాన్ని సావమంటన్నాడా, సంసారం శాతకాపోతే తనే పడి సావరాదూ!" "కొజ్జా వోడేమోనే!"

"అసలీయనెక్కడో సూసినట్టుగుందే. ఆఁమా పక్కీధిలోనే వుంటున్నాడు. దవిళేశ్వరంలోనే ఉద్యోగవఁనుకుంటా!... ఆయమ్మ ఎంత మంచిదో, పాపం! సీతమ్మోరే!"

సౌశీల్యంతో డ్రైవరన్నాడు : "చూసారా మీరు నోరు జారటం వల్ల ఎంత వరకొచ్చిందో. బండి

అసలే లేటు రన్నింగులో ఉంది. స్టేషనూ గీషనూ అంటే డేటు మారిపోద్ది, మా టాపు లేచిపోద్ది ! యస్సయిగారిని క్షమాపణ అడగండి."

ఇంక అందరూ ఆమాటే అనటం మొదలెట్టారు. వాళ్లని అననిచ్చి అననిచ్చి గంభీరంగా నేనన్నాను "సరే, నాకు క్షమాపణ అక్కర్లేదు. ఇంకెప్పుడూ ఆ ఆడకూతుర్ని అరడి పెట్టనని మాటిమ్మనండి చాలు'

శవాకారమై పోయి సౌశీల్యం తలొంచుక్కూర్చున్నాడు! నేను నా ఎటాచీ బాగ్‌లోంచి నోట్‌బుక్కూ పెన్నూ తీసాను. "నీ పేరేంటయ్యా" అనడిగాను సౌశీల్యాన్ని అతను మాట్లాళ్లేదు. మళ్లీ రెట్టించాను మాట్లాళ్లేదు.

వెంటనే స్టూడెంటన్నాడు : "ఇందాకన నేనడిగితే చెప్పాడు గదండీ, 'శాంతిమూలం సౌశీల్యం, బారేజిలో సూపర్‌వైజర్, దానవాయిపేట' అని". నేను అది రాసుకున్నాను. దాన్ని పైకి చదివాను "ఏం ఇంతేనా?" అనడిగాను. మళ్లీ సౌశీల్యం మాట్లాళ్లేదు.

అందరి వైపూ చూస్తూ అన్నాను : " ఈ ఆడపడుచు ఎప్పుడైనా ఆత్మహత్య చేసుకున్నట్టో హఠాత్తుగా మరణించినట్టో రిపోర్టేరానక్కర్లేదు, పేపర్లో పడ్డా చాలు, నేనే వస్తాను. ఈయన మీదే కేసు పెడతాను. మరి మీ అడ్రసులు కూడా ఇవ్వాలి". - ఇట్లా అంటూ డ్రైవరూ, కండక్టరూ, సౌశీల్యాన్ని గుర్తు పట్టిన ఆడవాళ్లూ, మరికొందరు ప్రయాణీకులూ - వీళ్లందరి అడ్రసులు తీసుకున్నాను.

"బస్సు పోనిమ్మ"న్నాను. బస్సు బయల్దేరింది. అంతే, ఇహనా వెనకాల్నించి శబ్దం వస్తే ఒట్టు! పాపం ఆ భార్య ఎట్లా ఆపుకుందో ఏమో ఏడుపును ఆపుకుంది.

రాజమండ్రిలో కంబాల చెరువు సెంటర్లో దిగిపోతూ దిగిపోతూ సౌశీల్యం నన్ను చూసిన చూపు మామూలు చూపుకాదు, "మావాఁ జోడు గుళ్ళ పిస్తోలు రా!" చూపు! నాకు తెలుసు అతని బుద్ధి పుడకల్తో గాని పోదని! కానీ ఆ భార్యకి లోకం పట్ల విశ్వాసమూ, జనంలో జాగరణా కలిగించాను కదా!

స్టూడెంటు కూడా నాతో బాటే బస్సు కాంప్లెక్స్‌లో దిగాడు. అన్నాడు : "మురారిలో ఆయన అడ్రస్సు కనుక్కోమని మీరు అన్నప్పుడే అనుకున్నాను సార్, మీరు మామూలు మనిషి కాదని..... మీరాయన్ని అరెస్టు చేసుండాల్సిందిసార్, గొప్పగా ఉండేది!"

నేను నవ్వాను, అన్నాను : "వద్దులే, మరీ పేట్రేగిపోతాడు. కానీ, నీ సహకారం మాత్రం గొప్పగా ఉందయ్యా! అందుకే మీ స్టూడెంటు కుర్రాళ్లంటే నాకు మోజు! సమాజంలో జరుగుతున్న అన్యాయాలపట్ల మీరు ఈ మాత్రం స్పందన చూపిస్తే చాలు, మన హిందూదేశం ఇట్టే బాగుపడుతుంది"?

నమస్కారం పెట్టి అతను వెళ్ళిపోయాడు.

నేను ఏలూరెళ్లాలి. కనక రాజమండ్రి స్టేషనుకు ఆదరాబాదరా చేరుకున్నాను. బయల్దేరుతున్న తిరుమల్లోకి ఒక్క గంతులో వెళ్లి పడ్డాను. జరిగిందంతా నెమరేసుకుంటూ జేబులోంచి ఐడెంటిటీకార్డు తీసాను. అందులో ఉన్న ఫొటోను ముద్దు పెట్టుకున్నాను. అది, ఏలేశ్వరం ప్రాజెక్టులో పని చేస్తున్న ఇంజనీరు నా స్నేహితుడిది. 'సంస్కరించుకొని సంస్కరించటం' అనే వృత్తిలో ఉన్న నేను, నా కాలేజీ వదిలి పెట్టగానే అతన్తో కలిసి జీపులో ఏలేశ్వరం నించి ఎర్రవరం వరకూ ప్రయాణం చెయ్యటంతో పొరబాటున అది నా జేబులో ఉండిపోయింది!

(ఆంధ్రసచిత్రవారపత్రిక 17 మార్చి, 89)

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★